క్లుప్తంగా

వార్డులవారీగా జూపల్లి సమీక్షలు

కొల్లాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయన అనుచరులతో సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చర్చించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలతో మమేకం కావాలని ఆయన సూచించారు. వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటానని, అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారనే దానిపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. బూతుల వారీగా ఓటర్లకు టచ్‌లో ఉండాలని చెప్పారు.

కల్వకుర్తిరూరల్: పార్టీ ఆశయాలతో పాటు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని జీజేవై సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు చెప్పారు. శనివారం నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తాడూరు: మండలంలోని పాపగల్‌కి చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు బచ్చిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి మర్రి హయాంలో జరిగిందన్నారు. బచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ను మండలంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ వెంకటరమణమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు చిన్న పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం అందరికి అందేలా చూడాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండలంలోని గుంతకోడూరులో ఎంపీడీఓ గంగామోహన్ శనివారం ఆకస్మికంగా నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేసేవరకు చర్యలు చేపట్టాలన్నారు.

అందుబాటులో విత్తనాలు

తాడూరు: జిల్లాలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అందుబాటులో పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు ఏఓ సాయిరమేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటకాలం 60 రోజులు పడుతుందని, కిలో విత్తనం ధర రూ.110లు కాగా ఎకరాకు ఎకరాకు 12 కిలోల విత్తనాలు సరిపోతాయని, వేసవి పంటగా ఫిబ్రవరి నుంచి మార్చి 15 వరకు విత్తుకోవచ్చన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు వివరాలకు శాస్త్రవేత్తలు ఆదిశంకర్, ప్రవీణ్‌కుమార్ 9912604549, 9494431405లను సంప్రదించాలని కోరారు.

బీఎస్పీ నాయకుల ధర్నా

తాడూరు: మండల కేంద్రంలో శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆ పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు పృథ్వీరాజు మాట్లాడుతూ 2018లో బీఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. హామీల కోసమే ఈనెల 13న జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించానున్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్, మహేష్, అంజి, మల్లేష్, శ్రీశైలం, వెంకటేష్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి అమానుషం

అచ్చంపేట: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం పట్టణంలో చేపట్టిన కార్యక్రమంలో న్యాయవాదులు రాంచందర్, కొయ్యల శ్రీనివాసులను అరెస్టు చేయడం శోచనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వంజా రవిందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కొయ్యల శ్రీనివాసులు అన్నారు. చట్టప్రకారం కేసులు చేసి కోర్టుకు అప్పగించాల్సి ఉన్నా సీఐ అనుదీప్ తీవ్ర పదజాలంతో దూషించి అవమానించడం సరైంది కాదన్నారు. దీనిని బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు.

చట్టాలపై అవగాహన

కల్వకుర్తిటౌన్: ప్రతి ఒక్కరు న్యాయ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని సినియర్ కోర్టు సివిల్ జడ్జి కుమారస్వామి పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి బస్సు డిపోలో ఆర్టీసీ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలు, న్యాయలను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మల్లేష్, మల్లేష్‌యాదవ్, శివకుమార్, డిపో మేనేజర్ సురేందర్, ఎస్‌ఐ రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దోమలపెంట(అచ్చంపేట): రెడ్డి సేవా సమితి, శ్రీశైలం వారి ఆధ్వర్యంలో శనివారం దోమలపెంటలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు వేమన పద్యాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని పరీక్ష రాసిన విద్యార్థుల పేపర్లను దిద్దిన తర్వాత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు త్వరలో బహుమతులను అందజేయనున్నట్లు రెడ్డి సేవాసమితి నాయకులు ఎల్లారెడ్డి, సుబ్బారెడ్డి తెలిపారు.

క్యాన్సర్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట: నాగర్‌కర్నూల్ జిల్లాను క్యాన్సర్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శనివారం అచ్చంపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జీబీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారి బారినపడి అనేక మంది మహిళలు, పురుషులు తమ ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంతో పాటు జిల్లాలో మహిళలు ఎవ్వరూ కూడా క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు జీబీఆర్ ట్రస్టు చైర్మన్ గువ్వల అమల ముందుకొచ్చిందని, ఇందుకు తమ వంతు సహాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీని కోసం హైదరాబాద్ అంకురం ఆస్పత్రి నుంచి ప్రముఖ గైనకాలజిస్టు పిలిపించి మహిళలకు వచ్చే క్యాన్సర్ వాటి లక్షణాలు నివారణ చర్యలు సూచిస్తున్నామన్నారు.

జీవన అలవాట్లతోనే..

క్యాన్సర్‌ను పారదోలేందుకు ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా పనిచేస్తే నివారించవచ్చని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్‌పై మాట్లాడడం, వ్యాధిపై చర్చించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. క్యాన్సర్ వ్యాధిని తొలిదశలోనే గుర్తించగలిగితే సులువుగా నివారించవచ్చన్నారు. నెలల్లో ఒకటి కంటే ఎక్కువ సార్లు రుతుస్రావం కావడం, తెల్ల, ఎర్రబట్ట వంటి లక్షణాలుంటే వెంటనే డాక్టరును సంప్రదించాలని అంకురం ఆస్పత్రి వైద్యురాలు సత్యశ్రీ అన్నారు. ప్రతి మూడు ఏళ్లకోసారి ప్యాసిమియర్ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం అన్నారు. కార్యక్రమంలో జీబీఆర్ ట్రస్టు చైర్మన్ గువ్వల అమల, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు పోకల మనోహర్, మార్కెట్ చైర్మన్ బలుస అరుణ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, జిల్లా సంక్షేమశాఖ అధికారి వెంకటలక్ష్మి, ఆర్డీఓ పాండునాయక్, ఎంపీపీ శాంతాబాయి, ఎన్నారైలు జగదీశ్వర్, బస్వ శంకర్, మేధ ఇనిస్టిస్ట్యూట్ అధ్యక్షుడు చిరంజీవి, ఎ.రాజేశ్వర్‌రెడ్డి, లోక్యానాయక్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: సిగరేట్, గుట్కా మద్యం వంటి మత్తు వ్యసనాలను వినియోగించడంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, మత్తుపై చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలని రావేఫ్ విద్యార్థులు సూచించారు. శుక్రవారం మండలంలోని ఖానాపూర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు మౌనిక, శివాణి, రామాంజలి, రామాదేవి, అనూష, రుచిత, సాయి ప్రసన్న పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల పరిధిలోని కుమ్మెర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ఉపాధ్యాయ బృందం క్యాన్సర్ డేను నిర్వహించి క్యాన్సర్ నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో పాటు సర్పంచ్ శ్రీదేవి, రావేఫ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలి

కందనూలు: నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించి ఆదుకోవాలని జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిదల రాము రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న యువజన, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం కొడిదెల రాము ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 6న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు బకాయిపడిన 4 ఏళ్ల నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ, సోషల్ మీడియా కార్యదర్శి మద్దెల చంటి, నాగర్ కర్నూల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ హరీష్ గౌడ్, కొల్లాపూర్ అసెంబ్లీ ప్రెసిడెంట్ ఉదయ్ యాదవ్, అచ్చంపేట అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్ భాష, అమ్రాబాద్ మండల ఎంపీపీ శ్రీనివాసులు, కల్వకుర్తి మండల బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కాయతి విజయ్ కుమార్ రెడ్డి, అమ్రాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ హరి నారాయణ గౌడ్, నాగర్ కర్నూల్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ తిరుపతి గౌడ్, తీగల దినేష్, మస్తాన్ పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రం ఇస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ఘనంగా కల్యాణం

పెద్దకొత్తపల్లి: దేవల్ తిరుమలాపూర్‌లోని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్ రెడ్డి, సత్యం, చిన్నయ్య, ఎంపీటీసీలు రవికుమార్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వేద పండింతులు భవనాచార్యులు, కృష్ణాచార్యులు, శేషాచార్యులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

భక్తిశ్రద్ధలతో వీరభద్రస్వామి ఊరేగింపు


శోభాయాత్రలో శివ స్వాములు

కందనూలు: పట్టణ పురవీధుల్లో నిర్వహించిన వీరభద్రుడి శోభాయాత్రతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. జిల్లా కేంద్రంలో శివదీక్ష గురు స్వామి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం వీరభద్ర స్వామి ఊరేగింపు సేవ, నందికోళ్ల సేవా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ శివాలయంలో స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా ఆర్డీఓ ఆఫీసు, బస్టాండ్, శ్రీపురం చౌరస్తా, నాగనూలు చౌరస్తా, కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపు కార్యక్రమం కొనసాగింది. ఈ మేరకు పాండురంగయ్య బృందం ఆధ్వర్యంలో ఖడ్గాలు, నంది కోళ్ల సేవ కార్యక్రమాన్ని నిర్వహించి స్వాములు శూలాలు గుచ్చుకోవడంతోపాటు టెంకాయలు పగలగొట్టే విన్యాసాలు నిర్వహించారు.

సామూహిక వివాహాల ఆహ్వానపత్రికల అందజేత

తెలకపల్లి: నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అండగా ఉన్నారని ఎంపీటీసీ సభ్యుడు రెడ్డపాకుల రమేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కమ్మరెడ్డిపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా ఆర్ రమేశ్ ఇంటింటికి తిరిగి సామూహిక వివాహాల ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో ఈనెల 12న ఎంజేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వివాహాలకు ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. సర్పంచ్ సుల్తాన్, ఉపసర్పంచ్ జానకీరాంరెడ్డి, మండల యువజన సంఘం ప్రధాన కార్యదర్శి భరత్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి సంతోష్ శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులకు సహకారం అందించాలనే సంకల్పంతో కార్యక్రమం చేపట్టానని చెప్పారు. కార్యక్రమంలో బాలగౌడ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



కల్వకుర్తిరూరల్: సీఎం కేసీఆర్ ఆరోగ్య తెలంగాణనే ధ్యేయంగా పనిచేస్తున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి మండలం గుండూరుకి చెందిన ఉషారాణికి మంజూరైన రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎంతో మంది పేద మధ్యతరగతి సామాన్య ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా పనిచేస్తుందని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్ ఉన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

కోడేరు: మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. ప్రజా ప్రతినిధులు ఆలస్యంగా రావడంతో 11గంటలకు జరగాల్సిన సమావేశం మధ్యాహ్నం 12.40 నిమిషాలకు ప్రారంభమైంది. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ కొండ వెంకటరాధ గైర్హాజరయ్యారు. వైస్ ఎంపీపీ కొత్త శ్రీనివాస్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి శ్రీరాం మాట్లాడుతూ రైతులకు రైతు బంధు ఇస్తున్నామన్నారు. మాచుపల్లి సర్పంచ్ పూర్ణచంద్రారెడ్డి, నర్సాయిపల్లి సర్పంచ్ సత్యనారాయనయాదవ్ మాట్లాడుతూ రైతు బంధుకు సంబంధించి వివరాలను గ్రామపంచాయతీల్లో జిరాక్స్ కాపీలను ఉంచాలన్నారు. వ్యవసాయాధికారులు దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్‌భానుకిరణ్ మాట్లాడుతూ మండలంలో పశువులు, గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అనంతరం మిషన్ భగీరథ ఏఈ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా అందించే ఇంటింటికి నల్లాల ద్వారా మండలంలో 33ట్యాంకులు ఉపయోగంలోకి వచ్చాయని అన్నారు. నర్సాయిపల్లి సర్పంచ్ సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ తమ గ్రామంలో మంచినీటి ఫ్లోరైడ్ ఎక్కువగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీఓ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కొత్త శ్రీనివాస్‌రావు

త్రుటిలో తప్పిన ప్రమాదం

లింగాల: మండలంలోని దారారం-క్యాంపురాయవరం మధ్యలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థులు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు. దారారం నుంచి మోటు రాయిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు ఎదురుగా మూలమలుపులో రాయవరం నుంచి ఓ స్కూల్ బస్సు సడెన్‌గా రావడంతో సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదం గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు పక్కకు తిప్పగా ట్రాక్టర్ బండరాయికి తగిలి దెబ్బతింది. రెండు టైర్లు, చంబర్, బంపర్ తదితర పరికరాలు విరిగిపోవడంతో నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ తెలిపారు.

ఆర్థికసాయం

కల్వకుర్తి: పట్టణంలోని శుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ అయాబ్ ఇటీవల మృతి చెందారు. శనివారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ద్వార రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం, వైస్ చైర్మన్ షాహెద్, జనార్దన్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: అకాల మృతి చెందిన చాకలి బాల్లచ్చమ్మ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరుపున ఆర్థిక సహాయం అందజేసినట్లు మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం తెలిపారు.

పండిత్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి



కందనూలు: పండిత్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని పండిట్, పీఈటీ జేఏసీల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు విజయకుమార్ మాట్లాడుతూ పండిత, పీఈటీలను వెంటనే పదోన్నతులు కల్పించేలా సీఎం కేసీఆర్‌కు కళ్లు తెరవాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతి పత్రం అందజేసిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పండిత, పీఈటీలు జేఏసీ జిల్లా నాయకులు శ్రీనివాస్, శేఖర్, రవికుమార్, శేఖర్ బాబు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈదమ్మ జాతర తైబజార్ వేలం రూ.1.10లక్షలు

కొల్లాపూర్: పట్టణంలో ఐదు మంగళవారాల పాటు సాగే ఈదమ్మ జాతర తైబజార్ వేలం పాట శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ రాజయ్య సమక్షంలో వేలం సాగగా ఆరుగురు వేలంలో పాల్గొన్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన హోటల్ మహేష్ రూ.లక్షా 10 వేలకు వేలం దక్కించుకున్నారు. ఇప్పటికే ఒక మంగళవారం జాతర పూర్తవగా మరో నాలుగు మంగళ వారాలు తైబజార్ వసూళ్లు కొనసాగుతాయన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఐతోల్‌లో కంటి వెలుగు పరీక్ష శిబిరం కొనసాగుతోంది. శనివారం పరీక్షలు నిర్వహించుకునేందుకు వచ్చిన వారందరికి వైద్యాధికారి డా అఖిలేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ మేరకు 371 మందికి పరీక్షలు నిర్వహించి 17 మందికి కంటి అద్దాలు, 9 మందికి అద్దాల కోసం ఆర్డర్ ఇచ్చామన్నారు. అలాగే నలుగురిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజేశ్వరి, శారద, శ్రీనివాసులు, బాలమణి పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు అసెంబ్లీలో చర్చించాలి

అచ్చంపేట: బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశా వర్కర్ల సమస్యలను చర్చించాలని కోరుతూ శనివారం ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, రాజ్యలక్ష్మి, భాగ్య, చంద్రకళ, కమల, విజయ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అవినీతి అక్రమాలపై విచారణ

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామపంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని, గ్రామానికి చెందిన కొంత మంది సమాచార హక్కు చట్టం ద్వార సేకరించిన వివరాలతో డిసెంబర్ 12న జరిగిన గ్రామసభలో అక్రమాలపై నిలదీశారు. ఈ సందర్భంలో ఇరు వర్గాల మధ్య వివాదం కొనసాగింది. గ్రామసభలో సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేయాల్సిందిగా ఆదేశించడంతో డీఎల్‌పీఓ పండరినాథ్ శనివారం పంజుగుల గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. అయితే నిధుల అక్రమాల విషయంపై డివిజనల్ పంచాయతీ అధికారి చేసిన విచారణ తూతూ మంత్రంగా ఉందని గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఆరోపించారు.


పంజుగులలో విచారణ చేస్తున్న పండరీనాథ్

సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం

వెల్దండ: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షపార్టీల నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గవర్నర్ ప్రసంగాన్ని విమర్శించే నేతలు ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్, రాజశేఖర్, సుభాష్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు, శ్రీను, జంగయ్య ఉన్నారు.


మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం

తెలకపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధారుఢ్యాన్ని ఇస్తాయని ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దపల్లిలోని బుగ్గా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విజేలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి గెలుపొందిన గుడిపల్లి జట్టుకు రూ.10,116 అందజేశారు. ఈ పోటీలకు దేవస్థాన మాజీ చైర్మన్ మద్దిలేటి, జగన్మోహన్‌గౌడ్ ఆర్థికంగా సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయరాం, బీఆర్‌ఎస్ నాయకులు బంగారయ్య, సుధాకర్, క్రీడాకారుడు నర్సింహ, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్, కుర్మయ్య, రమేశ్, యాదయ్య పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


జెండా ఆవిష్కరిస్తున్న కొండ నగేశ్, దిలీపాచారి

తెలకపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీజేపీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కార్యదర్శి వర్గ సభ్యుడు దిలీపాచారి, టీఆర్‌ఎస్ నాయకుడు కొండా నగేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని యోగా భవనంలో బీజేపీ మండలాధ్యక్షులు గన్నోజు నరేంద్రాచారి అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 10 నుంచి ఒక శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ అధ్యక్షతన మూడు బూత్‌లు కలిపి ఒక శక్తి కేంద్రంగా కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని సూచించారు.

మారెడుమాన్‌దిన్నెను మండలం చేయాలి

కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండలంలోని మారెడుమాన్‌దిన్నెను కొత్త మండలంగా ప్రకటించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ వీరపాగ అరవింద్ కోరారు. శనివారం ఆయన పట్టణంలో ఆర్డీఓ హనుమనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ గ్రామాన్ని మండలంగా చేయడం ద్వారా సమీప గ్రామాల ప్రజలకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉండడంతో పాటు పరిపాలనకు సౌలభ్యంగా ఉంటుందని ఆయన వివరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

బల్మూర్: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఇంటర్, పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లిన తర్వాత బాల్య మిత్రులతో మరచిపోలేని అనుబంధం ఇమిడి ఉంటుందని ఎస్‌ఓ లలిత గుర్తు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

హిందూ ధర్మ రక్షణ ప్రశంసనీయం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో సీతారామాంజనేయ స్వామి ఆలయం, స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠాపనతోపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రామ శ్రీమంతుడు జలంధర్‌రెడ్డిని విశ్వహిందు పరిషత్, స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరిషత్ సభ్యులు ఆయన ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసి లక్ష్మ యువగళ గీతచరణ్ పుస్తకాలను అందజేశారు. విశ్వహిందు పరిషత్ సమరత ప్రముఖ్ దామోదర్ శెట్టి పాల్గొన్నారు. అదేవిధంగా ఆలయం, విగ్రహాల దాత జలంధర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అమల దంపతులు పూజలో పాల్గొన్నారు.


జలంధర్‌రెడ్డిని సత్కరిస్తున్న పరిషత్ నాయకులు

ఘనంగా సుధాకర్‌రావు జన్మదిన వేడుకలు

కొల్లాపూర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం కొల్లాపూర్‌లో ఆ పార్టీ నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. సుధాకర్‌రావుతో పాటు ఆయన సతీమణి భారతి, బీజేపీ నాయకులు రక్తదానం చేశారు. ఇంటర్ చదువుతున్న అనాధ బాల,బాలికలకు రూ.5 వేల చొప్పున అందజేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బీజేపీ నాయకుడు ఏలేని సుధాకర్‌రావు జన్మదిన వేడుకలను శనివారం పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అనునిత్యం కష్టపడుతున్నారన్నారు. ఇప్పటికే ప్రత్యేక కోచింగ్‌లు, మెటీరియల్ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, ఖలీల్, వెంకటేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న సుధాకర్‌రావు దంపతులు

పంచాయతీ నగదు సొంత ఖాతాలో జమ!

కోడేరు: మండలంలోని గ్రామపంచాయతీలకు మంజూరు చేసిన నిధులను సొంత ఖాతాలోకి మళ్లించగా అధికారులు గుర్తించి వెంటనే గ్రామపంచాయతీ ఖాతాలకు జమ చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7.97లక్షలు ఉన్నాయి. ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ సాయికుమార్ 2022 డిసెంబర్ 26న జిల్లా మండల అధికారులు గ్రామపంచాయతీల్లో ఉన్న ఖాతాల్లోని డబ్బులను 0 బ్యాలెన్స్‌గా చూపాలని సూచించారు. చివరి రోజు అని చెప్పడంతో సర్వర్ బిజీగా ఉండటంతో 22 గ్రామపంచాయతీలకు సంబంధించిన డబ్బులను కంప్యూటర్ ఆపరేటర్ తన సొంత ఖాతాలోకి మళ్లించాడు. మరుసటి రోజు మండల అధికారి శ్రావణ్‌కుమార్ చూసి డబ్బులు సొంత ఖాతాలోకి వేసుకోవడం నిబంధనలకు విరుద్ధమని చెప్పి ఆయా గ్రామపంచాయతీల్లో ఆ డబ్బులను యథావిధిగా జమ చేయాలని కంప్యూటర్ ఆపరేటర్‌కు సూచించారు. దీంతో ఆపరేటర్ తన సొంత ఖాతాలోని డబ్బులను ఆయా గ్రామ పంచాయతీలకు డిసెంబర్ 27నుంచి జనవరి 6వరకు రోజు రూ.లక్ష చొప్పున జమ చేశాడు. సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్‌గా మారింది. ఈ విషయంపై ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా డబ్బులు ఖాతాలోకి మళ్లించడంతో వెంటనే గుర్తించి సరి చేయించామన్నారు. నిధులు పక్కదారి పట్టలేదన్నారు. గ్రామపంచాయతీలోని ఖాతాలో 0 బ్యాలెన్స్ చూపాలని జిల్లా అధికారుల ఆదేశాలు ఉండటంతో తన ఖాతాలోకి మార్చుకొని మళ్లీ గ్రామపంచాయతీ ఖాతాకు జమ చేశానని కంప్యూటర్ ఆపరేటర్ తెలిపారు.